## నాలుగు రోజులు టీజీబీ సేవలు బంద్

నవతెలంగాణ-వాంకిడి

ఈ నెల 28 నుండి 31వ తేదీ వరకు తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు నిలిపివేయనున్నట్టు రీజినల్ మేనేజర్ ప్రభుదాస్, బ్రాంచ్ మేనేజర్ జాడి కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు(ఏపీజీవీబీ) శాఖలు 2025 సంవత్సరం నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనమవుతున్నందున టీజీబీ బ్యాంకు పరిధిలోని లావాదేవీలు నిలిపివేయడం జరుగుతుందని తెలిపారు. శాఖలు, వ్యవస్థల సులభ విలీనం కొరకు శాఖా కార్యకలాపాలు, ఏటీఎం, యూపీఐ పేమెంట్స్, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, బ్యాలెన్స్ ఎంక్వైరీ మొదలగు ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు, ఖాతాదారుల సేవా కేంద్రాలు 28 నుండి 31 వరకు అందుబాటులో ఉండవని తెలిపారు. ఖాతాదారులు సహకరించి ముందస్తు లావాదేవీలు చేసుకోవాలని కోరారు. బ్యాంకు సేవలు తిరిగి జనవరి ఒకటో తేదీన అందుబాటులోకి వస్తాయని తెలిపారు.

## జాతీయస్థాయి బేస్ బాల్ పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

27 నుండి పంజాబ్‌లోని సంగూర్‌లో జరుగుతున్న 37వ జాతీయ స్థాయి సీనియర్ నేషనల్ బేస్ బాల్ ఛాంపియన్షిప్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల మహబూబాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ స్త్రీ, పురుషుల బేస్ బాల్ పోటీల్లో జిల్లా తరపున ప్రతిభ కనబరిచిన ఇచ్చోడ మండలం సిరిచెల్మకు చెందిన చెవుల సమత, జైనథ్ మండలం సావాపూర్‌కు చెందిన టింగని లోకేష్ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు జిల్లా బేస్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు వారు గురువారం పంజాబ్‌కు బయలుదేరినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను, జిల్లా జట్టు కోచ్ బొంగురాల గౌతంను డివైఎస్ఓ వెంకటేశ్వర్లు అభినందించారు.






## జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-కెరమెరి

జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు మండల కన్వీనర్ కూటికల ఆనందరావు అన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో శుక్రవారం ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో చేపట్టిన టోకెన్ సమ్మెకు మద్దతూ ప్రకటించి మాట్లాడారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు. అనంతరం సమ్మెనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నేర వేర్చాలన్నారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. వేతనాలు సక్రమంగా చెల్లించాలని పలుమార్లు మండల అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. అరకొర వేతనాలు అవి కూడా నెలల తరబడి చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. ఆరు నెలలుగా వేతనాలు లేక కార్మికులు కుటుంబ పోషణకు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. పంచాయతీ కార్మికులకు కనీస వేతనం, ప్రమాదం బీమా, కేటగిరి వారిగా వేతనాలు అందజేయాలని పేర్కొన్నారు. జీఓ నెంబర్ 51ని సవరించి 60 నెంబర్ ప్రకారం వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్రాతి పండగకు పెండింగ్ వేతనాలు చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికులు తిరుసుల్ల సంతోష్, పోర్ల స్వామి, కుటికెల నగేష్, మల్లేష్, పుల్లయ్య రవి, శ్రీనివాస్, జైవంత్, పాండు, వెంకటేష్ పాల్గొన్నారు.

## వెయ్యి గొంతులు..లక్ష డప్పులతో ప్రభుత్వంపై ఒత్తిడి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎస్సీ వర్గీకరణను అమలులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన వెయ్యి గొంతులు - లక్ష డప్పులతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానున్నట్లు ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్ తెలిపారు. ఆసిఫాబాద్ మండలంలోని కొమ్మగూడ గ్రామంలో నిర్వహించిన సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఫిబ్రవరి 3న హైదరాబాద్‌లో నిర్వహించే కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశం ద్వారా ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ప్రభుత్వంపై ఒత్తిడికి వచ్చే దిశగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మాదిగలు పెద్ద ఎత్తున తరలివచ్చి దీన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పొన్నాల నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి రేగుంట మహేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి కంబాల రమేష్, నాయకులు ఈగురపు సంతోష్, సురేష్, ప్రసాద్, శేఖర్, ప్రతాప్, గోపాల్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమం ఉధృతం

నవతెలంగాణ-రెబ్బెన

గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను అనేక సార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. పోరాటంలో భాగంగా 27, 28 తేదీలలో రెండు రోజుల పాటు టోకెన్ సమ్మె చేస్తున్నామన్నారు. గ్రామాలలో పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంపింగ్ యార్డ్స్, హరితహారం, పల్లె పకృతి వనాలు, వైకుంఠధామాలు తదితర పనుల్లో కార్మికులు ఉంటున్నారని పేర్కొన్నారు. ప్రజలకు అంటువ్యాధులు, అనారోగ్యాలు రాకుండా సేవలందిస్తున్నారన్నారు. 2018లో గత రాష్ట్ర ప్రభుత్వం జీఓ నెం.51ని విడుదల చేసి సిబ్బంది వేతనాలను రూ.8,500కు పెంచిందన్నారు. కానీ వేతనాలు పెంచుతూనే పంచాయతీ కార్మికుల మెడకు ఉరితాళ్లను బిగిస్తూ మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



కెరమెరి : మండల కేంద్రంలోని సుల్తాన్‌గూడ ఆదివాసీ మిత్ర వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఐఆర్ఎస్ ఇన్‌కం టాక్స్ అధికారి రాథోడ్ ప్రకాష్ హైదరాబాద్ వారి సహకారంతో 30మంది వృద్ధులకు దుప్పట్లు అందించారు. చలి తీవ్రత దృష్ట్యా పేద వృద్ధులకు పంపిణీ చేశాశారు. కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు సుజాయిత్ ఖాన్, అడ వెంకటేష్, రాంచందర్, షేక్ ఫారూక్, షాదుల్ల పాల్గొన్నారు.

# మోదం..ఖేదం..!

- వాతావరణం సహకరించినా..ఆశించిన దిగుబడి రాలేదు
- తేమ పేరిట ధరలో కోత విధించడంతో తీవ్ర నష్టం
- రైతుభరోసా రాక..రుణమాఫీ పూర్తికాక అసంతృప్తి
- అధిక మంది రైతులకు మద్దతు ధర లభించని వైనం
- ఈ ఏడాది ఒడిదొడుకుల మధ్య సాగిన వ్యవసాయం

**ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయం అన్నదాతలకు కలిసిరాలేదు. వాతావరణం సహకరించినా..వివిధ కారణాలతో ఆశించిన పంట దిగుబడి రాకపోవడం..పండించిన పంటకు మార్కెట్‌లోనూ గిట్టుబాటు ధర పక్కనపెడితే కేంద్రం ప్రకటించిన మద్దతు ధర కూడా పొందలేకపోవడంతో అసంతృప్తికి గురవుతున్నారు. మరోపక్క ఈ ఏడాది ప్రభుత్వం నుంచి రైతుభరోసా కింద పెట్టుబడి సాయం కూడా దక్కలేదు. కేవలం రూ.2లక్షల లోపు రుణమాఫీ అయిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుండగా.. రూ.2లక్షలకు పైగా ఉన్న రైతులకు మాఫీ జరగకపోవడంతో తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ ఏడాది పంటల బీమా సైతం అమలు కాలేదు. మరోపక్క తేమ పేరిట ధరలో భారీగా కోత విధించడం, ప్రయివేటు వ్యాపారులు కనీసం మద్దతు ధర కూడా చెల్లించకపోవడంతో రైతులు అసంతృప్తికి లోనవుతున్నారు. ఈ ఏడాది అన్నదాతలకు వ్యవసాయం ఖేదం..మోదంలా మారింది.**




నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది వ్యవసాయ పరిస్థితులు భిన్నంగా కనిపిస్తున్నాయి. ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు మార్కెట్‌లో సరైన గిట్టుబాటు ధర లభించకపోవడంతో ప్రతి ఏటా ఖరీఫ్ కాలాన్ని నష్టాలతోనే ముగించాల్సి వస్తోంది. ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలో 5.60లక్షల మంది రైతులు 17.50లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయగా.. ఇందులో అధికంగా పత్తి 10.57లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వరి పంట 3.30లక్షల ఎకరాలు, సోయా 1.95లక్షలు, కంది 90వేలు, ఉద్యాన పంటలు మరో 60వేల ఎకరాల్లో సాగు చేశారు. వీటితో పాటు మొక్కజొన్న, మిర్చి, టమాట తదితర పంటలు సాగు చేశారు. ఖరీఫ్ ప్రారంభంలో బీటీ విత్తనాల కోసం కొన్ని రోజుల పాటు ఆందోళన నెలకొనగా.. ఉన్నతాధికారుల చొరవ కారణంగా ఈ సమస్య త్వరగానే పరిష్కారమైంది. అనంతరం వర్షాలు సాధారణం కంటే అధికంగానే కురవడంతో పంటలు ఏపుగా పెరిగేందుకు దోహదం చేసింది. కానీ పంట ఏపుగా పెరిగిన క్రమంలో వివిధ తెగుళ్లు, కీటకాల కారణంగా ఆశించిన దిగుబడి రాలేకపోయింది. ఈ ఏడాది ప్రారంభంలో పెన్‌గంగా నది వరదల కారణంగా బేల, జైనథ్, భీంపూర్ మండలాల్లో వేలాది ఎకరాల్లో పంట నష్టం జరగగా.. ప్రభుత్వం నష్టం పరిహారం చెల్లించింది.

**పంటలకు మద్దతు కరువాయే..!**

ఉమ్మడి జిల్లాలో పత్తి సాగు మీదనే అధిక మంది రైతులు ఆధారపడి జీవనం సాగిస్తుంటారు. ఇదే ప్రధాన పంట కావడంతో పత్తి ధరపై అందరి దృష్టి ఉంటుంది. ఈ ఏడాది కేంద్రప్రభుత్వం క్వింటాల్ పత్తికి రూ.7521 మద్దతు ధరను ప్రకటించింది. కానీ పత్తిలో తేమ 12శాతానికి పైగా చూపించడంతో తొలుత సీసీఐ కొనుగోలు చేసేందుకు నిరాకరించింది. దీంతో ప్రయివేటు తక్కువ ధరకు క్వింటాల్‌కు రూ.6700చొప్పున కొనుగోలు చేయడంతో ఒక్కో రైతు క్వింటాల్‌కు రూ.800 నుంచి రూ.900వరకు నష్టపోవాల్సి వచ్చింది. తేమ పేరిట ధరలో కోత విధించడం కారణంగా రైతులు పలుమార్లు రోడ్కెక్కాల్సి వచ్చింది. అనంతరం పత్తిని ఆరబెట్టి మార్కెట్‌కు

పత్తికి మద్దతు ధర కోసం రైతుల ఆందోళన(ఫైల్)



తీసుకొచ్చిన రైతులు సీసీఐకి విక్రయించారు. దీంతో ప్రయివేటు వ్యాపారులు ధర అధికంగా చెల్లించాల్సి వస్తుందనే కారణంగా కొనుగోలుకు అంతగా ముందుకు రాలేకపోయారు. దీంతో ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటి వరకు సీసీఐ 78,453 మంది రైతుల నుంచి 15.83లక్షల క్వింటాల్ పత్తిని కొనుగోలు చేయగా.. ప్రయివేటు వ్యాపారులు కేవలం 8862 మంది రైతుల నుంచి 1.46లక్షల క్వింటాల్‌లు మాత్రమే కొనుగోలు చేశారు. మరోపక్క సోయా పంటను సైతం పూర్తిగా కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**రైతుభరోసా రాక నిరాశ..!**

ప్రభుత్వం ప్రతి ఏటా రైతులకు పెట్టుబడి సాయం రైతుబంధు ఇస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని రైతుభరోసాగా మార్చింది. ఎకరానికి రూ.7500చొప్పున ప్రతి రెండు సీజన్లకు ప్రతి ఏటా రూ.15వేలు అందజేస్తామని హామీనిచ్చింది. ప్రభుత్వం ఈ పథకం విధివిధానాలపై రైతుల నుంచి ప్రజాభిప్రాయ సేకరణ సైతం చేపట్టింది. కానీ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో మాత్రం రైతులకు ఈ పథకం కింద పెట్టుబి సాయం అందించకపోవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రబీ సీజన్‌కు సైతం ఇప్పటికే ఖాతాల్లో జమ కావాల్సి ఉండగా.. ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. రానున్న సంక్రాంతి నాటికి అందజేస్తామని చెబుతోంది. మరోపక్క జిల్లాలో రూ.2లక్షల కంటే తక్కువగా ఉన్న రైతులు ఆదిలాబాద్ జిల్లాలో 55వేల మందికి సుమారు రూ.600కోట్ల పంట రుణాలను మాఫీ చేసింది. కానీ రూ.2లక్షలకు పైగా ఉన్న వారితో పాటు సాంకేతిక కారణాలతో మాఫీ వర్తించని అనేక మంది రైతులకు ఇంకా రుణమాఫీ జరగకపోవడంతో వారంతా ప్రభుత్వం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఈ సమస్యను గుర్తించినా ఇంకా పరిష్కరించడం లేదు. మరోపక్క అధికారంలోకి రాగానే పంటల బీమాను అమలు చేస్తామని ప్రభుత్వం హామీనిచ్చినా..ఈ ఏడాది అమలుకాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను అమలు చేయడంతో పాటు వారికి ఎదురవుతున్న సమస్యలను పరిష్కరిస్తే అన్నదాతలకు ప్రయోజనం చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు, రైతులు(ఫైల్)



వ్యవసాయ మార్కెట్‌కు పోటెత్తిన పత్తి బండ్లు(ఫైల్)




పత్తిని మార్కెట్‌కు తరలించడానికి ట్రాక్టర్‌లో నింపుతున్న రైతు

## మన్మోహన్ మృతికి పలువురి సంతాపం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ మృతికి పలువురు సంతాపం తెలిపారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశం ఒక గొప్ప నేతను కోల్పోయిందన్నారు. పదికి పైగా జిడిపి సాధించిన దేశంగా నిలబెట్టిన గొప్ప వ్యక్తి మన్మోహన్ అని కొనియాడారు. ఉపాధి హామీ పథకంతో పాటు ఎన్నో రకాల సంస్కరణలు అందుబాటులో తీసుకొచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు చరణ్, పట్టణ అధ్యక్షులు రఫిక్, మైనారిటీ ప్రెసిడెంట్ షేక్ అసద్, జిల్లా యూత్ అధ్యక్షులు గుండా శ్యామ్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు ఎండి ఆసిఫ్, మాజీ ఎంపీటీసీ గడవేణి మల్లేష్, మాజీ సర్పంచ్ సెండే దత్తు, మాజీ ఎంపీటీసీ మేకర్తి శ్రీనివాస్, ఆత్రం వినోద్, కలీం, బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రమేష్, రైతు అధ్యక్షులు వైరాగడే మారుతీ, మాలి సంఘం అధ్యక్షులు శంకర్, శివప్రసాద్, గోపాల్, జమీర్, తిరుపతి, గంగారాం, బాలు, బసు, అయ్యాన్ పాల్గొన్నారు.

**బెజ్జూర్ :** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి టీపీసీసీ మెంబర్ అర్షద్ హుస్సేన్ ఘన నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి సేవలను కొనియాడారు. దేశం గొప్ప నేతను కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రంగు సురేష్‌గౌడ్, శ్రీనివాస్, షణ్ముఖ పాల్గొన్నారు.

**వాంకిడి :** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపంగా మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధవిహార్‌లో శుక్రవారం భారతీయ బౌద్ధ మహాసభ, అంబేద్కర్ యువజన సంఘం, సిద్ధార్థ యువజన సంఘం ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహెూల్కర్, పూలే అంబేద్కర్ బుద్ధ వెల్ఫేర్ సొసైటీ మండలాధ్యక్షుడు బీఎస్ఐ జిల్లా ఆర్గనైజర్ ఉప్రే విజయ్, ప్రధాన కార్యదర్శి కోబ్రాగడే విలాస్, సమాజ అధ్యక్షుడు మహాత్మే రాజేంద్రప్రసాద్, అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు దుర్గం హంసరాజ్, దుర్గం శ్యామ్‌రావు, నాయకులు ఉప్రే రోషన్, రాంటెంకి ప్రతాప్, రమేష్, డోంగె హిరిశన్, దుర్గం కిరణ్, చునార్కర్ శివాజీ, నూతన్, రమేష్, జైపాల్, సోను, దుర్గం సంతోష్, కె తిరుపతి, చంద్రమణి, వివేక్, దుర్గం పోచాలు, అశోక్, శ్రీకాంత్ పాల్గొన్నారు.




ఆసిఫాబాద్ : నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**ఆత్రం సుగుణ సంతాపం**

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మరణం కాంగ్రెస్ పార్టీకి, దేశ ప్రజలకు తీరనిలోటని పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు నారాయణ, పట్టణాధ్యక్షుడు అనిల్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ దాదాజీ, సీనియర్ నాయకులు సుధాకర్, గణేష్, హన్మంత్, జైరాం, సునీల్, గోవింద్ పాల్గొన్నారు.

**పెంచికల్‌పేట్ :** మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మధుకర్, నాయకులు పాలె సంతోష్, ఎల్లూరి శంకరి, లచ్చిరాం పాల్గొన్నారు.

**రెబ్బెన :** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన నివాళులు అర్పించాయి. పార్టీ అధ్యక్షుడు లావుడ్య రమేష్ మాట్లాడుతూ మన్మోహన్‌సింగ్ తన విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థను మలుపు తిప్పిన గొప్ప ఆర్థికవేత్త అని కొనియాడారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, పలువురు యువజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




వాంకిడి: ఆత్రం సుగుణతో పాటు కాంగ్రెస్ నాయకుల నివాళి

పెంచికల్‌పేట : బీజేపీ నాయకుల నివాళి



## ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటాం

- మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పసుల రామ్మూర్తి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాలని, అంబేద్కర్ ఆశయాలను కొనసాగించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండలం మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు కొండపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ జెండా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నీల్ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ లబ్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేపట్టేందుకు అవలంబిస్తున్న తీరును అంబేద్కర్ ఆశయాలతో అడ్డుకునేందుకు మాలలంతా ఐకమత్యంతో ముందుకెళ్లాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే రిజర్వేషన్లు కోల్పోయి విద్యా, ఉద్యోగ అవకాశాలు కోల్పోతామని తెలిపారు. పార్లమెంటులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా తప్పు ఒప్పుకొని డాక్టర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ పట్ల ప్రభుత్వాల తీరు మారేంతవరకు పట్టుదలతో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, జాతీయ ఉపాధ్యక్షుడు ముత్తమాల పుల్లయ్య, జాతీయ కార్యదర్శి కాశర్ల యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిష్టయ్య, పురుషోత్తం, రాష్ట్ర కార్యదర్శి మధుబాబు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల అధ్యక్షుడు పురుషోత్తం, రత్నం సుధాకర్, నాగరాజు, ప్రధాన కార్యదర్శి హనుమంతు పాల్గొన్నారు.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బోరిగాం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్ఐ సందీప్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు చెట్ల పొదలలో దాడులు నిర్వహించగా అందులో పేకాట ఆడుతునఉన ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని, వారి నుండి రూ. 5,500, ఐదు బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | డిసెంబర్ 28, 2024 | www.navatelangana.com


## యువజన కాంగ్రెస్ నాయకులకు ఆత్మీయ సన్మానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి విదేశీ పర్యటన ముగించుకుని తిరిగి ఆదిలాబాద్ వచ్చేసిన సందర్భంగా పట్టణంలోని ప్రజా సేవా భవన్, క్యాంపు కార్యాలయం వద్ద సందడి వాతావరణం నెలకొంది. నియోజకవర్గ వ్యాప్తంగా వచ్చిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పూలమాలలు శాలువాలతో సత్కరించి



అభినందనలు చెప్పారు. అనంతరం ఇటీవల ఎన్నికైన యువజన కాంగ్రెస్ నాయకులు శాంతన్‌రావు, సాయి చరణ్‌గౌడ్, సామ రూపేష్‌రెడ్డిలను అభినందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యలు దూరం

నవతెలంగాణ-బోథ్

బోథ్ ప్రాంత ప్రజల విద్యుత్ ఓవర్ లోడ్ సమస్యలను దూరం చేసేందుకు మండల కేంద్రంలో 5ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు విద్యుత్ ఎస్ఈ జేఆర్ చవాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో స్థానిక సబ్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోథ్ ప్రాంతంలో విద్యుత్ సమస్య ఉండేదని, దానిని పరిష్కరించేందుకు 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ బిగిస్తున్నట్టు తెలిపారు. ఇదివరకు విద్యుత్ సరిపోక చాలా ఇబ్బందులు పడ్డ బోథ్ ప్రాంత ప్రజల కష్టాలు తీర్చడానికి అదనంగా టాన్స్‌ఫార్మర్ బిగించి, పక్కనే ఇంకో ప్లిన్త్ నిర్మించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంఆర్‌టీ, డీఈ, ఇచ్చోడ సబ్ డివిజన్ ఏడీ, ఏఈ పాల్గొన్నారు.



# నిజాయితీకి నిలువుటద్దం మన్మోహన్‌సింగ్

- మాజీ ప్రధాని మన్మోహన్‌కు ఘన నివాళ్ళు



ఆదిలాబాద్‌టౌన్ : కంది శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుల నివాళి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిజాయితీకి, నిబద్ధతకు, నిరాడంబరతకు నిలువుటద్దం ఆర్థికవేత్త మాజీ ప్రధాన మంత్రి డాక్టర్ మన్మోహన్ సింగ్ అని కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన క్యాంపు కార్యాలయం ప్రజా సేవాభవన్ ఆవరణలో సంతాప సభ ఏర్పాటు చేశారు. మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నేడు తన లాంటి ఎంతో మంది రైతు బిడ్డలు వ్యాపార వేత్తలుగా ఎదగడానికి కారణం ఆయన సంస్కరణలే అన్నారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కొట్టు మిట్టాడుతున్న వేళ ఆర్థిక మంత్రిగా తన దైన శైలిలో పలు ఆర్థిక సంస్కరణలు ప్రవేశ పెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిలో పెట్టిన మేధావి అని కొనియాడారు. దేశాన్ని లైసెన్స్ రాజ్ నుంచి సంస్కరణలవైపు మళ్లించిన గొప్ప నాయకుడని అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్‌తో పాటు దేశానికి పూడ్చలేని లోటని పేర్కొన్నారు. ప్రొఫెసర్‌గా, ఎకనామిస్ట్‌గా రిజర్వ్‌బ్యాంక్ గవర్నర్‌గా, ఆర్థిక శాఖా కార్యదర్శిగా, ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్‌గా, యూజీసీ చైర్మెన్‌గా, ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా ఎనలేని సేవలందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి మన్మోహన్ సింగ్ అని గుర్తు చేశారు. దేశ జీడీపీ 3శాతంగా దేశం క్లిష్ట పరిస్థితిలో ఉన్నప్పుడు అనేక ఆర్థిక సంస్కరణలతో వృద్ధి రేటును పరుగులు పెట్టించిన ఆర్థిక మేధావి అన్నారు. దేశంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు నాంది పలికిన మహానుభావుడన్నారు. ఆయన మృతికి సంతాపంగా ఏడు రోజులు సంతాపదినాలుగా పాటిద్దామన్నారు. అనంతరం సభలో పలువురు నాయకులు దేశానికి ఆ మహనీయుడు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ దిగంబర్‌రావు పటేల్, సయీద్ ఖాన్, పట్టణాధ్యక్షులు గుడిపల్లి నగేష్, నాయకులు గిమ్మ సంతోష్‌రావు, మునిగెల నర్సింగ్, లోక ప్రవీణ్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని, కౌన్సిలర్లు కలాల శ్రీనివాస్, బండారి సతీష్, ఆవుల వెంకన్న, సంద నర్సింగ్, రామ్‌కుమార్, భూమన్న, లక్ష్మణ్, షేక్ ఇమ్రాన్, జాఫర్ అహ్మద్, నాయకుడు షకీల్, సహీద్ ఖాన్, పోరెడ్డి కిషన్, కొండూరి రవి ఉన్నారు.

**ఉట్నూర్** : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి భారతదేశానికి తీరనిలోటని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులను తీసుకువచ్చిన ఘనత మన్మోహన్ సింగ్‌కే దక్కుతుందన్నారు. మాజీ ప్రధాన మంత్రి పీవీ నరసింహారావుతో కలిసి దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దారని గుర్తు చేశారు. ఆర్థిక మంత్రిగా, దేశ ప్రధానిగా దేశానికి ఎనలేని సేవలు చేశారన్నారు. కాంగ్రెస్ ఆయన ఆశయ సాధనకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. మన్మోహన్ సింగ్ మృతి పట్ల ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**తలమడుగు** : భారత మాజీ ప్రధాని, రిజర్వ్ బ్యాంక్ గవర్నర్ ఆర్థికవేత్త దివంగత మన్మోహన్ సింగ్‌కు కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఘనంగా నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశ ఆర్థిక వ్యవస్థ గాడి తప్పినప్పుడు ఆర్థిక సంస్కరణలు చేపట్టి ప్రపంచ దేశాల మన్ననలు పొందిన ఏకైక వ్యక్తి దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్యాణం రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ బోల్లారపు బాబన్న, మాజీ ఎంపీటీసీలు వెంకన్న యాదవ్, రమేష్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గంగారెడ్డి, రామ్ చందర్‌రావు, మాజీ సర్పంచ్ లస్మన్న, విలాస్, రావుల నారాయణ, నడిపెన్న, గంగారాం, మోహన్, వెంకటి పాల్గొన్నారు.

**ఆదిలాబాద్‌రూరల్** : ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దిన పరిపాలనా దక్షుడు భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్(92) మరణం చాలా బాధాకరమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ గురువారం రాత్రి తుదిశ్వాస విడవడంతో కాంగ్రెస్ ఆధ్వర్యంలో తన నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మావల మండలాధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, మావల మండల మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్‌రెడ్డి, కోఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, యువజన జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, యూత్ కాంగ్రెస్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ రంజిత్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు గౌతమ్, ఆదిలాబాద్ టౌన్ వైస్ ప్రెసిడెంట్ అలీం ఖాన్, సినియర్ నాయకులు నలిమెల నవీన్ రెడ్డి, సంగీత, కామ్రాన్ బేగం, కొరటి ప్రభాకర్, రెండ్ల రాజన్న, సర్దార్, ఎదుల స్వామి పాల్గొన్నారు.

**ఇచ్చోడ** : మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ లేని లోటు దేశానికి తీరనిదని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డాక్టర్ మన్మోహన్ సింగ్-1991లో ఆర్థిక మంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా పరివర్తన చెంది, ఆర్థిక సంస్కరణల ద్వారా గుర్తించబడ్డారని తెలిపారు. భారతదేశం సరళీకరణ ప్రక్రియలో అతని నాయకత్వం మార్కెట్ శక్తులను విడుదల చేసిందని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...**

ఆర్థిక సంస్కరణలతో దేశ భవిష్యత్తును ఉత్తమంగా తీర్చిదిద్దిన పరిపాలనా దక్షుడు భారత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ (92) మరణం చాలా బాధాకరమని బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ మహమూద్ ఖాన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎస్టీసెల్ వైస్ ప్రెసిడెంట్ కుమురం కొటేష్, ఇచ్చోడ మండల ప్రెసిడెంట్ నారాయణరెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మెన్ కొత్తూరు లక్ష్మణ్, బోథ్ నియోజవర్గ మైనార్టీ చైర్మెన్ మహమ్మద్ ముస్తఫా, మాజీ ఉపసర్పంచ్ షేక్ మహబూబ్, ఇచ్చోడ జనరల్ సెక్రటరీ చోలే ప్రభాకర్, షఫీ అహ్మద్, శివకుమార్, ప్రవీణ్, బాబురావు, మజీద్ ఖాన్, షేక్ షబ్బీర్, హరి పాల్గొన్నారు.

**బోథ్** : మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద స్వర్గీయ డాక్టర్ మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, ప్రముఖులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ బొడ్డు గంగారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ గొర్ల రాజు యాదవ్, నాయకులు చట్ల ఉమేష్, షేక్ నాజర్ అహ్మద్, బత్తుల రమేష్, భోజన్న, షేక్ షాకీర్, గట్ల గంగాధర్ పాల్గొన్నారు.

**యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో...**

తెలంగాణ వాసుల కోరిక నెరవేర్చిన మహానుభావుడు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ అని బోథ్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ గుడాల సతీష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలుగాలని ఆయన పట్ల సంతాపం వ్యక్తం చేశారు.



ఆదిలాబాద్‌రూరల్ : బోరంచు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ప్రధానికి నివాళులు



తలమడుగు : సుంకిడిలో కాంగ్రెస్ నాయకుల నివాళులు

## అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్ని ప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఫైర్ స్టేషన్ ఆఫీసర్ డి.జైత్రం అన్నారు. శుక్రవారం రిమ్స్‌లో జూనియర్ వైద్యులు, సిబ్బందికి అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఆస్పత్రితో పాటు ఇండ్లలో అగ్ని ప్రమాదం సంబవించినపుడు ఏ విధంగా వ్యవహరించాలో ప్రయోగత్మకంగా చూపించారు. ప్రమాదాలు జరిగినప్పుడు బయపడకుండా మంటలను అదుపు చేయడంపై దృష్టి సారించాలన్నారు. పెద్ద ప్రమాదం ఉన్న సమయంలో వెంటనే అగ్రిమాపక శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. అప్పటి వరకు మంటలను అదుపు చేయడంలో ఫైర్ పరికరాలను ఉపయోగించాలన్నారు. ప్రమాదలపై అవగాహన ఉంటే పెద్ద నష్టం జరగకుండా నివారించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, అగ్నిమాపక శాఖ లీడ్ ఫైర్‌మెన్ గులాం యస్థాని, డ్రైవర్ ఆపరేటర్ ప్రదీప్ సింగ్, ఫైర్ ఆఫీసర్లు రాము, అన్వేష్, మధుకర్, సాయిప్రసాద్, ఫేరోజ్ ఖాన్, పృథ్వీరాజ్, అధికారులు పాల్గొన్నారు.

## కేంద్రమంత్రి అమీత్‌షా వెంటనే రాజీనామా చేయాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి హమీత్‌షా వెంటనే రాజీనామా చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఇచ్చోడలో ఆయా రాజకీయ పార్టీలు వివిధ దళిత గిరిజన బీసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన ర్యాలీలో వారు పాల్గొని మాట్లాడారు. నిర్మల్ బైపాస్ రోడ్డు నుంచి అంబేద్కర్ చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌక్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం చేశారు. రాజ్యాంగ వ్యతిరేక శక్తిగా బీజేపీ వ్యవహరిస్తుందని అన్నారు. అమిత్‌షా పార్లమెంట్‌లో మాట్లాడే స్వేచ్ఛ కూడా అంబేద్కర్ ఇచ్చాడని గుర్తుంచుకోవాలని అన్నారు. మరోసారి అంబేద్కర్‌పై ఎవరైనా విమర్శ చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఈ ర్యాలీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు అన్ని కులమతాలకు అతీతంగా ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమ్ర కోటేశ్వర్, ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అన్నెల లక్ష్మణ్, ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్ ఖాన్, నారాయణరెడ్డి, ధర్మపాల్, సాబేర్, ఆశన్న, లస్మన్న, చందు, బొజ్జ రవి, బొజ్జ లక్ష్మణ్, బత్తుల ఊశన్న, ముస్తాఫా, కొత్తూరి లక్ష్మణ్, రాజేశ్వర్, మైల మహేష్, వెంకటేష్, స్వామి పాల్గొన్నారు.

## రేపు రౌండ్ టేబుల్ సమావేశం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డా.బీఆర్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా, అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తున్నట్టు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో లౌకిక ప్రజాస్వామిక పార్టీలు, ప్రజా సామాజిక సంఘాలు, కార్మిక, కర్షక, విద్యార్థి యువజన సంఘాలు, మేధావులతో కలిసి డిసెంబర్ 29న విద్యానగర్‌లోని సుందరయ్య భవనంలో ఉదయం 10.30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశానికి పార్టీ రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్ పాల్గొంటారని పేర్కొన్నారు. రాజ్యాంగ రక్షకులు, లౌకిక, ప్రజాస్వామిక వాదులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా ఈశ్వర్ సింగ్ బాబా వర్ధంతి



నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని రాజులగూడ గ్రామంలో శుక్రవారం రాష్ట్ర యోగి సంత్ శ్రీ ఈశ్వర్ సింగ్ బాబా 35వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్సంగ కార్యక్రమం చేపట్టారు. ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చిన అరవింద్ శాస్త్రి భక్తులను ఉద్దేశించి ప్రవచనం చేశారు. కార్యక్రమంలో రామ్‌సింగ్ మహారాజ్, గణేష్ మహారాజ్, ఉట్నూర్ మాజీ జెడ్పీటీసీ చారులత రాథోడ్, మాజీ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గజానంద్ నాయక్, మాజీ సర్పంచ్ రాథోడ్ సావీందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ శ్రీరామ్ జాదవ్, కారోబారి రాథోడ్ డిగాంబర్, మాజీ ఎంపీటీసీ రమేష్, మాజీ సర్పంచ్ విష్ణు, గజానంద్, నారాయణ భక్తులు పాల్గొన్నారు.

## బంజారా భజనకారులకు ఆహ్వానం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని వేణునగర్, సేవాదాస్‌నగర్, నాయక్‌నగర్, పాత ఉట్నూర్, కొమ్ముగూడ గ్రామ భజనకారులకు శుక్రవారం ఆహ్వాన పత్రం అందజేశారు. బంజారా రచయిత వేదిక ఆధ్వర్యంలో జనవరి 5న జరుపుకునే భజన కార్యక్రమానికి భజన మండలీలందరూ భజన కార్యక్రమానికి తప్పకుండా రావాలని బంజారా రచయితల వేదిక అధ్యక్షుడు డాక్టర్ జాదవ్ ఇందల్ సింగ్, బంజారా రచయితలు కవన కోకిల జాదవ్ బంకట్ లాల్, చవాన్ పరమేశ్వర్ ఉన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సోషల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల అండ్ కళాశాల ప్రిన్సిపాల్ లలిత కుమారి అన్నారు. శుక్రవారం పాఠశాలలో శాంతినగర్ అర్బన్ పీహెచ్‌సీ ఆధ్యర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పిల్లలను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. రక్తనమూనాలను సేకరించి ఇద్దరిని రిమ్స్‌కు రెఫర్ చేశారు. అదే విధంగా ఆరోగ్య పాఠశాలలో భాగంగా క్షయా వ్యాధిపై అవగాహన కల్పించారు. రెసిడెన్షియల్ విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో పాటు ఆరోగ్య సూత్రలను తెలియజేస్తున్నామని అన్నారు. శాంతినగర్ పీహెచ్‌సీ వైద్యులు 560 మందిని పరీక్షించి, కేవలం ఇద్దరిని మాత్రమే రిమ్స్‌కు రెఫర్ చేశారన్నారు. నిత్యం విద్యార్థులకు ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. దాని కారణంగా విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నారని తెలిపారు. కాగా కొందరు సీజనల్ వ్యాధులు దగ్గు, జలుబుతో బాధపడుతున్నారని తెలిపారు. వారికి వైద్యులు మందులు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో శాంతినగర్ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇఫ్ఫత్, సూపర్‌వైజర్ కేమ రాజరెడ్డి, భూమయ్య, ఏఎన్ఎం రుక్మిణి, శ్వేత, హెల్త్ సూపర్‌వైజర్ పద్మ, ఆశా వర్కర్ శీరిష పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

నిర్మల్ పట్టణంలోని మినీ ట్యాంక్‌బండ్ నుంచి ప్రధాన ఆస్పత్రికి వెళ్లే సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం మున్సిపల్ చైర్మెన్ గండ్రత్ ఈశ్వర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి వెళ్లే మార్గంలో ర్యాంప్ దెబ్బతిని ప్రమాదకరంగా మారిందన్నారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ర్యాంప్, సీసీ రోడ్డు పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ ముజ్జు చౌస్, కాంట్రాక్టర్ ఫుర్ఖాన్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఒంటి కాలిపై నిల్చొని ఉద్యోగుల నిరసన

- 18వ రోజుకు చేరిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమను విద్యాశాఖలో విలీనం చేసి సర్వీస్‌లను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం 18వ రోజు చేరుకుంది. సమ్మెలో భాగంగా ఎన్టీఆర్ చౌక్‌లో ఒంటి కాలిపై నిలబడి వినూత్న నిరసన తెలిపారు. అనంతరం దివంగత మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతికి సంతాప సూచకంగా నివాళులర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. సీఎం ఇకనైనా స్పందించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు.

**పలువురి సంఘీభావం...**

దీక్ష శిబిరాన్ని అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న, ఉపాధ్యక్షులు సత్యనారాయణ పెంటపర్తి ఉశన్న, రమేష్, అసోసియేట్ అధ్యక్షులు శ్రీనివాస్, బుచ్చన్న సంఘీభావం తెలిపారు. నేరడిగొండ మండల పీఆర్టీయూ నాయకులు గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, బిక్కులాన్ మల్లీశ్వరి సందర్శించి సంఘీభావం ప్రకటించారు. ఉద్యమాన్ని నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం జారీ చేసిన జీఓను ఉపసంహరించుకోవాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పడాల రవీందర్, అధ్యక్షురాలు ప్రియాంక కార్యదర్శి ధరంసింగ్, శ్రీకాంత్, కేశవ్, సురేష్, ప్రకాష్, దేవధర్శన్, మమత, సురేందర్, వెంకటి, పార్థసారథి, భోజన్న, రాకేష్ ఉన్నారు.

# దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మావల ఎస్సై విష్ణువర్ధన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దొంగతనాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మావల ఎస్సై వంగ విష్ణువర్ధన్ సూచించారు. శుక్రవారం మావల పోలీసుల ఆధ్వర్యంలో స్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులకు కరపత్రాలను పంపిణీ చేస్తూ, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ పండుగలకు, శుభకార్యాలకు, ఊర్లకు వేళ్లే వారు ఇంట్లో దొంగతనాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విలువైన వస్తువులను ఇంటోలు పెట్టొద్దని, సెంట్రల్ లాక్ సిస్టమ్ తాళలను అమర్చుకోవాలన్నారు. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛదంగా కమిటీలను నిర్వహించుకోవాలని సూచించారు. ఎవరైన అనుమానితులు కనిపిస్తే డయల్ 100 లేదా పోలీసు స్టేషన్ నెంబర్ 8712659925కు సమాచారం ఇవ్వాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే ఎలాంటి లింక్‌లు ఓపెన్ చేయొద్దన్నారు. తమ వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోని తప్పనిసరిగా తాళాలు వేయాలన్నారు. నమ్మకమైన వాచ్‌మెన్లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలని, ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూసుకుంటూ ఉండాలన్నారు. ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్త చెదారం, న్యూస్ పేపర్, పాల ప్యాకెట్లు జమ కానివ్వకుండా చూడాలని వాటిని కూడా గమనించి దొంగలు దొంగతనాలకు పాల్పడుతారని పేర్కొన్నారు. మెయిన్ డోర్‌కి తాళం కప్ప వేసినప్పటికి అవి కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయడం మంచిదన్నారు. బయటకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, బయట కొన్ని లైట్లు వేసి ఉంచాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, కాలనీవాసులు ఉన్నారు.

## కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట చేపట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా భారత ఆర్థిక వ్యవస్థలో పెను మార్పులు తీసుకొచ్చిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షులు భూసారం గంగాధర్ మాట్లాడుతూ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఆర్థిక సంక్షోభంలో ఉన్న దేశాన్ని గట్టెకించారని అన్నారు. జిల్లా అధికారులకు 15 రోజుల ముందుగానే సమ్మె నోటీస్ ఇచ్చినా కూడా విద్యాశాఖ అధికారుల చొరవ చూపడం లేదని అన్నారు. కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లో తాత్కాలికంగా ఉపాధ్యాయులను నియమించడం చాలా దురదృష్టకరమన్నారు. ఇకనైనా స్పందించి వెంటనే తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘాల నాయకులు రాజారత్నం, నవీన్, రాము, ప్రభ, నవిత, సంగీత, ప్రత్యూష, లతదేవి, జ్యోతి, వీణ, అపర్ణ పాల్గొన్నారు.

## రక్తహీనత లేని సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

నవతెలంగాణ-సారంగాపూర్

సమాజంలో రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారిని కాపాడాల్సిన బాధ్యత ఆరోగ్యశాఖపై ఉందని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.రాజేందర్ అన్నారు.శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఒకే రోజున అన్ని ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పరిధిలో రక్తహీనత పరీక్షల కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. ఇందుకు సంబంధించిన మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఇది విజయవంతమైతే జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి రక్తహీనత పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్టు తెలిపారు. హెచ్‌బి పరీక్షల మాక్‌డ్రిల్‌ను డీఎంహెచ్ మండలం చించోలి(బి) గ్రామంలో పరిశీలించారు. రక్తహీనత పరీక్ష పరికరాలు, స్ట్రిప్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గతంలో గర్భిణీ స్త్రీలకు మాత్రమే రక్తహీనత పరీక్షలు నిర్వహించే వారమని, ఇప్పుడు దీన్ని ఒక ఉద్యమంగా తీసుకొని, జిల్లాను రక్తహీనత లేని జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు వెల్లడించారు. ఆయన వెంట జిల్లా మాస్ మీడియా అధికారి బారే రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణ మోహన్‌గౌడ్, మోయిన్ అలీ ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

# ఆర్థిక సంస్కరణలకు ఆద్యులు మన్మోహన్‌సింగ్

- ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



మన్మోహన్ చిత్రపటానికి నమస్కరిస్తున్న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్

ఆర్థిక సంస్కరణలకు ఆద్యులు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ అని సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో శుక్రవారం మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యేతో పాటు బీజేపీ నాయకులు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ ఆర్థిక వేత్త మన్మోహన్‌సింగ్ అని అన్నారు. ఆర్థిక సంస్కరణలతో దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని అన్నారు. ప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కోశాధికారి అరుణ్‌లోయ, మాజీ కౌన్సిలర్లు దెబ్బటి శ్రీనివాస్, బాల్క శ్యాంకుమార్, నాయకులు కొప్పుల శంకర్, నీరటి సత్యనారాయణ, ఆర్మీ శివ, నారాయణ, సంతోష్ ఠాకూర్, గణపతి, సదానందం, బాబూరావు, ఇస్తారి పాల్గొన్నారు.

**నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళులు అర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని ఆయన నివాసంలో మన్మోహన్ చిత్రపటం వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనదైన శైలిలో సరళీకృత ఆర్థిక విధానాలను ప్రవేశపెట్టి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టిన గొప్ప ఆర్థికవేత్త మన్మోహన్‌సింగ్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ ఛైర్మన్ సిడం గణపతితో పాటు నాయకులు పాల్గొన్నారు.



మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు

**పలు సంఘాల ఆధ్వర్యంలో..**

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు శుక్రవారం కాగజ్‌నగర్ పట్టణంలో పలువురు ఘనంగా నివాళులు అర్పించారు. స్థానిక రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో రిటైర్డ్ ఉద్యోగులు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అదేవిధంగా సీనియర్ సిటిజన్ల సంఘం ఆధ్వర్యంలో మన్మోహన్ చిత్రపటం వద్ద నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆర్థిక సంస్కర్తగా, వివాదరహితుడుగా మన్మోహన్‌సింగ్ పేరు చరిత్రలో నిలిచిపోయిందని అన్నారు. వేర్వేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమాలలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు జయదేవ్ అబ్రహం, శివప్రసాద్, సభ్యులు బి నర్సయ్య, సునీల్, కె పురుషోత్తం, అంకయ్య, వి రామయ్య, సీనియర్ సిటిజన్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ, నాయకులు యు నారాయణ, ఎస్ఆర్ మూర్తి, కలికోట రమణయ్య, ఆకుల నాగేశ్వర్‌రావు, కోటేశ్వర్‌రావు, చిలుక లక్ష్మినారాయణ, మార్త రాంబాబు పాల్గొన్నారు.

**ఆసిఫాబాద్** : జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సభ్యులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు గరిపెల్లి కరుణగౌడ్, ఆసిఫాబాద్ యూనిట్ అధ్యక్షులు కానోజీ రమేష్, ఉపాధ్యక్షులు సిరాజ్ ఉల్ హుక్, వినోద్, వెంకటేష్, గజ్జెల పోచన్న, చెట్ల కమలాకర్, ప్రభాకర్, పుల్లూరి శంకర్ పాల్గొన్నారు.

**ఎస్ఎస్ఏ సమ్మె శిబిరం వద్ద**

కలెక్టరేట్ కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె శిబిరం వద్ద మాజీ ప్రధానికి ఘనమైన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతిక, ప్రధాన కార్యదర్శి తుకారాం, గౌరవ అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షులు నాగసుధ, మీడియా ప్రతినిధి సంతోష్ పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ : విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో..

## వంట వార్పుతో ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్



తమ సర్వీస్ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్ష 18వ రోజులో భాగంగా వంటావార్పు నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట భోజనాలు చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు శృతికా మాట్లాడుతూ తమ సమ్మె 18వ రోజుకు చేరినప్పటికీ డిమాండ్‌లను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమ్మె ప్రభావంతో రాష్ట్రం అంతా ఉందన్నారు. విద్యా వ్యవస్థ రిపోర్టు, కేజీబీవీ, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో గత రోజులుగా విద్యార్థులు బోధన అందటం లేదని అన్నారు. ఎంఆర్సీలలో ఎంఐఎస్‌లు, సీసీఓలు మెసెంజర్లు సమ్మెలో పాల్గొనడంతో రాష్ట్రం అంతటా ఎమ్మార్సీలు మూతబడి ఉన్నాయన్నారు. వెంటనే ప్రభుత్వ పెద్దలు స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల జిల్లా ప్రధాన కార్యదర్శి తుకారాం, సంఘం జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్, దుర్గం సందీప్, అన్నపూర్ణ, చైతన్య, కేజీబీవీ ప్రత్యేకాధికారి కవిత, ఎంఐఎస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్, రాజేష్, రాజ్‌కుమార్, సీసీఓ అధ్యక్షుడు అనూప్, సీఆర్పీ ప్రధాన కార్యదర్శి రాజేష్, వెంకటేష్, పీజీ సీఆర్టీలు అన్నపూర్ణ, స్వప్న, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, ప్రకాష్, తిరుపతి, దేవేందర్, మహేష్, శివరాం, ప్రసన్న, స్వప్న, విజయ, బాబు, తిరుపతి, సుభాష్, సతీష్ పాల్గొన్నారు.

## టీచర్‌గా మారి పాఠాలను బోధించిన తండ్రి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఓ తండ్రి తన పిల్లలకు టీచర్‌గా మారి పాఠాలు బోధించారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన జి.శ్రీనివాస్ పాల వ్యాపారం చేస్తూ తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే పిల్లలకు వరుసగా సెలవులు రావడంతో తండ్రే టీచర్‌గా మారి పాఠాలు బోధించాడు. ప్రతి నిత్యం వ్యాపారంలో బిజీ బిజీగా గడిపే శ్రీనివాస్ తన షెడ్డులోనే తనకున్న బిజీ సమయాన్ని శుక్రవారం పిల్లల కోసం ప్రత్యేకంగా కేటాయించి, బోర్డుపై పాఠాలు చెబుతూ ఆదర్శంగా నిలిచారు. దీంతో పిల్లలు తండ్రి చెప్పింది శ్రద్ధగా వింటూ నేర్చుకున్నారు. పాఠశాల పాఠాలతో పాటు జీవితం గురించి హిత బోధ చేస్తూ పిల్లలను మోటివేషన్ చేశారు.

## కొలాం ఆశ్రమ పాఠశాలలో వైద్యశిబిరం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



మండలంలోని అంకోలి ఆస్పత్రి పరిధిలోని కొలాం ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలో వైద్యశిబిరాన్ని నిర్వహించినట్టు డా.సర్పరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు రక్తపరీక్షలు నిర్వహించి, తగు మందులను అందజేశామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత గూర్చి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఆడే సురేష్, హెల్త్ అసిస్టెంట్ పవార్ ప్రేమ్‌సింగ్, ముయ్యాల మోతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సీఆర్టీల సమ్మె

నవతెలంగాణ-ఉట్నూర్

ఐటీడీఏ ఎదుట కొనసాగుతున్న గిరిజన ఆశ్రమ పాఠశాల సీఆర్టీల సమ్మె శుక్రవారం 12వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సీఆర్టీల డిమాండ్లను అమలు చేసే వరకు సమ్మె యధావిధిగా కొనసాగుతుందని ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు ఉయిక రమేష్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1200 మంది సీఆర్టీలకు నెల వారీగా వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ సమ్మెలో సీఆర్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు, మహిళలు పాల్గొన్నారు. అనంతరం వారు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతి పట్ల సంతాపం తెలిపారు.

## రహదారి నిర్మాణానికి సహకరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని తిర్పెల్లి సమీపంలో ఆగిపోయిన రహదారి నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే పాయల శంకర్ కోరారు. శుక్రవారం రహదారి నిర్మాణం వల్ల ఇండ్లను కోల్పోతున్న వారితో ఆయన మాట్లాడారు. రోడ్డు నిర్మాణం వల్ల పట్టణాభివృద్ధితో పాటు ప్రయాణికులకు మేలు జరుగుతుందని తెలిపారు. ఇండ్ల యాజమానులు ముందుకు వస్తే రావాల్సిన నష్టపరిహారం వచ్చేలా కృషి చేస్తానని అన్నారు.

## టీఎస్‌పీటీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్‌కు సంబంధించి 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరించారు. శుక్రవారం పట్టణంలోని ప్రజాసేవా భవన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన అసోసియేషన్ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌పీటీఏ జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ రియాజ్, జనరల్ సెక్రటరీ కాంతం, ఉపాధ్యాయులు చరణ్‌సింగ్, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ సభ్యులు

నవతెలంగాణ-లోకేశ్వరం

ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌ను మండలంలోని రాజూర లిఫ్ట్ ఇరిగేషన్ కమిటీ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుద్దవాగు నుంచి గ్రామానికి 2017లో ప్రారంభమైన లిఫ్ట్ ఇరిగేషన్ 1350 ఎకరాలకు సాగు నీరు అందించగా ప్రతి సంవత్సరం పైప్‌లైన్ లీకేజీలకు, మోటర్ మరమ్మతులకు దాదాపు రూ.6లక్షలు ఖర్చు అవుతుందని తెలుపగా స్పందించిన ఎమ్మెల్యే మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారని కమిటీ సభ్యులు తెలిపారు.

# సీపీఐ(ఎం) రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జనవరి 25 నుండి 28 వరకు సంగారెడ్డిలో నిర్వహించే సీపీఐ(ఎం) నాలుగవ రాష్ట్ర మహాసభల కరపత్రాలను శుక్రవారం పార్టీ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్ మాట్లాడుతూ సీపీఐ(ఎం) పేదలు, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, కష్టజీవుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతున్న పార్టీగా గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రజాస్వామ్యం, లౌకిక విధానం, సామాజిక న్యాయం కోసం అంకిత భావంతో ఉద్యమం చేస్తున్నట్టు వివరించారు. సంగారెడ్డి జిల్లాలో మహాసభలు జరుగుతాయని, ఈ మహాసభలకు రాష్ట్ర వ్యాప్తంగా 1000 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. మహాసభల మొదటి రోజు జరిగే బహిరంగ సభలో ప్రకాష్ కారత్, కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్, బివి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పాల్గొంటారన్నారు. జిల్లా నుండి ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు రాజేందర్, గెడం టీకనంద్, నాయకులు గొడిసెల కార్తీక్, దుర్గం నిఖిల్, జాడి తిరుపతి పాల్గొన్నారు.

## పార్టీల విలీన సభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నేడు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీన సభ విజయవంతం చేయాలని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జగజంపుల తిరుపతి కోరారు. జిల్లా కేంద్రంలో విలీనసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత విప్లవోద్యమానికి, దేశంలో దోపిడీ, పీడన లేని సమసమాజ స్థాపనకు బలమైన ఒకే కమ్యూనిస్టు, బలమైన పార్టీ నిర్మాణం అవసరమన్నారు. కమ్యూనిస్టు ఉద్యమంలో మొదటి తరం సైద్ధాంతిక చీలికలకు గురై, రెండవ తరం నాయకత్వరూపాలు ఉద్యమంలో తప్పుడు ఎత్తుగడలు, పదవి వ్యామోహాలు, ఆర్థిక అరాచకత్వం చీలికలకు దారి తీశాయని తెలిపారు. చీలికలకు గురైన సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఒకే పార్టీగా ఏకమవుతున్న విలీన సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొరే కళ్యాణ్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు వీరయ్య, శ్రీనివాస్, పెంటు, బాబురావు, హేమంత్, వంశీ, అఖిల్, ప్రదీప్, సమీర్, వంశీ పాల్గొన్నారు.

# మంచినీళ్లైనా తాగిపించండి సారూ..!

- ఎస్పీఎం యాజమాన్యానికి సర్దార్‌బస్తీ వాసుల మొర



నవతెలంగాణ-కాగజ్‌నగర్

తమకు కనీసం మంచినీళ్లైనా తాగిపించండి అంటూ కాగజ్‌నగర్ పట్టణం సర్దార్‌బస్తీవాసులు మొర పెట్టుకుంటున్నారు. మిల్లుకు అతి సమీపంలో కాలనీ ఉండడంతో నిత్యం మిల్లు నుండి వెలువడే దుర్గంధాన్ని తాము పీలుస్తూ, అనారోగ్యం బారిన పడుతున్నా లెక్కచేయకుండా 24 గంటల పాటు మంచినీళ్లయినా అందిస్తున్నారనే ఏకైక కారణంతో ఇక్కడ నివసిస్తున్నామని వారంటున్నారు. ఇపుడు దానిలో కూడా కోత విధించడంతో తాము అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆ కాలనీవాసులు వాపోతున్నారు. గతంలో ఉన్న మిల్లు యాజమాన్యం తమ కాలనీకి 24 గంటల పాటు తాగునీరు అందించేందని, ఇపుడు సమయపాలన లేకుండా నీటి సరఫరా జరుగుతుండడంతో ఏ సమయంలో నీళ్లు వస్తాయో తెలియని పరిస్థితి నెలకొందని వాపోతున్నారు.

**ఉదయం 5 నుండి రాత్రి 10 వరకు నీటి సరఫరా చేయాలి : కోట శ్రీనివాస్**

తమ కాలనీకి ఉదయం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నిరంతరాయంగా మంచినీటి సరఫరా చేయాలని కాలనీకి చెందిన కోట శ్రీనివాస్ డిమాండ్ చేస్తున్నాడు. కాలనీలో అధిక శాతం మిల్లు కార్మికులే ఉన్నారని, వారికి మంచినీటి సరఫరా ఎపుడు జరుగుతుందో తెలియకపోవడంతో కొన్ని సార్లు విధులను మానుకొని నల్లాల ద్వారా వేచి చూడాల్సి వస్తోందని ఆయన ఆవేదన చెందారు. తమకు నీటి సరఫరా చేయని పక్షంలో మిల్లు గేటు ముందు ఆందోళన చేపడుతామని హెచ్చరించారు.

## రైతుకు నష్టపరిహారం అందజేత

నవతెలంగాణ-సిర్పూర్(టి)



సిర్పూర్ రేంజ్ పరిధిలో పులి, చిరుత దాడుల్లో మరణించిన పశువులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేసినట్లు ఎఫ్ఆర్ఓ ఇక్బాల్ హుస్సేన్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని అటవీ క్షేత్రాధికారి కార్యాలయంలో పులి, చిరుత దాడుల్లో మృతి చెందిన పశువులకు చిన్న మాలినికి చెందిన మడావి సాగర్‌కు, మేడిపల్లికి చెందిన సెడ్మకి భీమ్‌రావుకు రూ.5000 చొప్పున, శివపురుకు చెందిన దండిక శ్రీనివాస్‌కు రూ.16,000, ఎకాన్కర్ బావుజీకి రూ.15000 చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు మేత కోసం పశువులను దట్టమైన అటవీ ప్రాంతాలకు కాకుండా బహిరంగ ప్రదేశాల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీధర్‌చారి, ఎఫ్ఎస్ఓ మోహన్‌రావు, ఎఫ్‌బిఓలు అరుణ్‌రెడ్డి, అరవింద్, హబీబా తపస్సు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి వెంకటలక్ష్మి కుటుంబం కనబడట్లేదా..?

- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నవతెలంగాణ-బెజ్జూర్



వసతి గృహాల్లో విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా ప్రభుత్వంలో చలనం లేదని, పేదలకు అన్యాయం, పెద్దలకు న్యాయంలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. గురుకుల విద్యాలయాల్లో సరియైన వసతులు లేక విద్యార్థులు చనిపోతున్నారని, విద్యార్థులు మృతి చెందడం బాధాకరమని తెలిపారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అందుగులగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముందుగా బీఎడ్ విద్యార్థి తొర్రెం వెంకటలక్ష్మి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని తెలిపారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో ఆర్ఎస్‌పి ఫోన్లో మాట్లాడారు. న్యాయం చేయాలని కోరారు. విద్యార్థి మృతికి ప్రభుత్వం ఇప్పటివరకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించలేదని తెలిపారు. ప్రభుత్వం కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, ఇల్లు ఇస్తామని హామీ ఇచ్చి వారం రోజులైనా నెరవేర్చలేదన్నారు. హాస్టళ్లలో వసతులు లేక విద్యార్థులు మరణిస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి, ముఖ్యమంత్రి పట్టించుకోవడం లేదన్నారు. హైదరాబాద్‌లో ధనిక రేవతికి ఒక న్యాయం, జిల్లాకు చెందిన పేద వెంకటలక్ష్మికి మరొక న్యాయమా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 54 మంది విద్యార్థులు చనిపోయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విద్యార్థుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందన్నారు. జిల్లాలో విద్యార్థుల మరణంపై కమిటీ ఏర్పాటు చేసి కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు రాంప్రసాద్, ఖాజామోహినుద్దీన్, సలీం, ఆవుల రాజ్‌కుమార్, బుస సారయ్య, దుర్గం తిరుపతి, రామ్టెంకి నవీన్ పాల్గొన్నారు.

## రెండు సెల్‌ఫోన్ల అప్పగింత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తాము పోగొట్టుకున్న రెండు సెల్‌ఫోన్‌లను ఈజ్‌గాం పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి శుక్రవారం బాధితులకు అప్పగించారు. మండలంలోని తుంగమడుగు గ్రామానికి చెందిన దాడి రవి, ఈజ్‌గాం విలేజ్ నెంబర్ 4కు చెందిన రాంరాయ్‌లు తమ సెల్‌ఫోన్‌లను పోగొట్టుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఈజ్‌గాం పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి వాటిని తిరిగి బాధితులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఈజ్‌గాం ఎస్ఐ మహేందర్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ పోయినా, దొంగతనానికి గురైనా వెంటనే బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే ఆ సెల్‌ఫోన్ ట్రేస్ చేయడానికి అవకాశాలు ఉంటాయని తెలిపారు. సెల్‌ఫోన్‌లను ట్రేస్ చేయడంలో ప్రతిభ కనబరుస్తున్న కానిస్టేబుల్ నయీం, హెడ్ కానిస్టేబుల్ శంకర్‌లను ఎస్ఐ ఈ సందర్భంగా అభినందించారు.



## నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-జన్నారం



అఖిలభారత ప్రధాన్ ఉత్తన్ సంఘటన్ మండల అధ్యక్ష కార్యదర్శులుగా మండలంలోని దేవునిగూడాకు చెందిన కుర్సెంగ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా వెంకటరమణాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పెందూర్ లక్ష్మణ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్న అనంతరం మాట్లాడారు. ప్రధాని కులస్తులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని, వారికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన్ నాయకులు పచ్చికి సుధాకర్, కుర్సెంగ మోహన్‌రావు, కౌసల్య, మడవి మన్మోహన్, కాసిపేట మండల ప్రధాన కార్యదర్శి కుడుమేత శంకర్ పాల్గొన్నారు.

## అమిత్ షాను మంత్రివర్గం నుంచి తొలగించాలి

నవతెలంగాణ-జన్నారం




భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ను పార్లమెంట్లో అవమానపరిచిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను మంత్రివర్గం నుంచి తొలగించాలని సీఐటీయూ మంచిర్యాల జిల్లా నాయకులు కూకటికారి బుచ్చయ్య మండల కన్వీనర్ అంబటి లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు నిరసన తెలుపుతూ నినాదాలు చేశారు. రాజ్యాంగాన్ని రచించిన మహానుభావుడిని అమిత్‌షా అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. వెంటనే భారత ప్రజలకు అమిత్‌షా బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ఇంధన్‌పల్లి అడవుల్లో గడ్డి క్షేత్రాల పరిశీలన



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్‌లోని ఇంధన్‌పల్లి రేంజ్ పరిధిలోని భర్తన్‌పేట్ అడవుల్లో ఉన్న గడ్డి క్షేత్రాలను శుక్రవారం ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ హేమంత్(ఐఎఫ్ఎస్) శుక్రవారం పరిశీలించారు. అలాగే అడవుల్లో ఉన్న బర్డ్ వాచింగ్ ప్రాంతాలైన మైసమ్మకుంట, గాని శెట్టి కుంట, ప్రాంతాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచినట్లయితే అడవుల్లో ఉండే శాఖాహార జంతువులకు ఎంతో ఉపయోగమన్నారు. శాకహార జంతువుల అభివృద్ధికి గడ్డి క్షేత్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. శాఖాహార జంతువులు ఎక్కువగా ఉంటే పులులు కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. అడవుల్లో గడ్డి క్షేత్రాలను విరివిగా పెంచాలని స్థానిక అటవీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్, ఎఫ్ఎస్ఓలు రవి, హనుమంతరావు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం



నవతెలంగాణ-జైపూర్

శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని భీమారం ఎస్ఐ శ్వేత అన్నారు. భీమవరం మండల కేంద్రంలో గురువారం వ్యాపారస్తులు, గ్రామస్తులతో కలిసి సమావేశమైన ఆమె గ్రామంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. ప్రతి గ్రామంలో ప్రతి కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల రాకపోకలు రోడ్డు ప్రమాదాలు అనుమానస్పద వ్యక్తులను గుర్తించడం జరుగుతుందని తెలిపారు. ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని, ఒక వ్యక్తి నిఘ 12 గంటలు మాత్రమే ఉంటుందని ఒక సీసీ కెమెరా 24 గంటలు నిరంతరాయంగా నిఘా ఉంటుందని తెలిపారు. వీలైనంతవరకు ప్రతి ఒక్కరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రయత్నించాలని ఈ సందర్భంగా కోరారు.

## దళితులపై వివక్ష విడనాడాలి



నవతెలంగాణ-జైపూర్

దళితులపై వివక్ష ఇంకెన్నాళ్లు కొనసాగిస్తారని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు జిమ్మిడి కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చెన్నూర్ పట్టణ కేంద్రంలో ఏర్పాటుచేసిన టీవీపీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడిచిన ఇంకా దళితులు దళితులు గానే, అంటరానివారుగా చూడబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా దళితుల జీవితాల్లో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం పథకాల పేరుతో దళితులను నమ్మించి మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. జనవరి 4 చెన్నూర్ పట్టణ కేంద్రంలో 'దళితులపై వివక్షత ఎన్నాళ్ళు' అనే అంశంపై సెమినార్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సదస్సుకు చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి, జైపూర్, భీమవరం మండలాల దళితులు సామాజిక ఉద్యమ కారులు హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాండ్ర అనిల్, కావేరి మధు, దుర్గం బొందన్న శ్రీనివాస్, సుందిళ్ల రాజేశ్వరి, మంత్రి లక్ష్మి, సత్యక్క పాల్గొన్నారు.

# మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-జన్నారం




తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) తెలంగాణ రాష్ట్ర ఆరవ మహాసభలు డిసెంబర్ 28, 29, 30 తేదీలలో లక్ష్మీ గార్డెన్స్ నల్లగొండ పట్టణంలో నిర్వహించడం జరుగుతోందనీ ఆ మహాసభలను విజయవంతం చేయాలని మండల టీఎస్‌యూటీఎఫ్ నాయకులు అన్నారు. శుక్రవారం టీఎస్‌యూటీఎఫ్ నాయకులు మహాసభల పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగ్గఆ టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల రాజావేణు మాట్లాడుతూ టీఎస్‌యూటీఎఫ్ తెలంగాణ రాష్ట్ర ఆరో మహాసభలకు జిల్లాలోని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరుతున్నామన్నారు. ఈ మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగ బలోపేతం కోసం, ప్రభుత్వ విద్యలో ఉన్న సమస్యలను తీర్మాన రూపంలో మహాసభ ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించడం జరుగుతుందని, అదేవిధంగా నూతన విద్యా విధానం 20-20ను రద్దు చేయాలని, సీపీఎస్ విధానం రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. ఉపాధ్యాయ సమస్యలు పర్యవేక్షక అధికారుల పోస్టులైన ఎంఈఓ, డీఈఓ, డిప్యూటీఈఓ పదోన్నతులు, ఉపాధ్యాయులకు ఇచ్చి భర్తీ చేయాలని, పీఆర్సీ వెంటనే అమలు చేయాలని, రెసిడెన్షియల్, కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాలు, మోడల్ స్కూల్‌లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరికీ హెల్త్ కార్డులు ఇచ్చి ఉచిత వైద్యం అందించాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు సర్వ శిక్ష ఉద్యోగులందరికీ మినిమం టైం స్కేల్ ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల కిరణ్ కుమార్, మండల అధ్యక్షుడు జిల్లపెల్లి బాపు, ప్రధాన కార్యదర్శి సాత్పడి నర్సయ్య, ఉపాధ్యక్షుడు కాంతారావు పాల్గొన్నారు.

# దళితుల హక్కులను హరిస్తున్నారు

- దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోషన్న




నవతెలంగాణ-జైపూర్

స్వాతంత్రం సిద్ధించి 77 సంవత్సరాలు పూర్తిచేసుకుంటుండగా రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు నేటికీ దళితుల దరిచేయడం లేదని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి దేవి పోషన్న ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం భీమారం మండల కేంద్రంలో స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలు ఆవిష్కరించిన ఆయన అఖిల భారత దళిత హక్కుల ఉద్యమం జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా కోరారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మతి పట్ల సంతాపం వ్యక్తం చేసి నివాళులు అర్పించిన ఆయన తరతరాలుగా అణిచివేత అంటరానితనం వివక్షతకు దళితులు నలిగిపోతున్నారని అన్నారు. అట్టడుగు వర్గాలైన దళితుల అభివృద్ధి లక్ష్యంగా దేశవ్యాప్తంగా దళిత సామాజిక న్యాయం కోసం విద్య వైద్య వ్యాపారాన్ని రద్దు చేయాలని ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం దళితుల వాట కోసం సమర శంఖం పూరించాలన్నారు. దళితులను ఆర్థిక రాజకీయ సామాజిక హక్కుల పరిరక్షణ సామాజిక న్యాయం కొరకు కుల వివక్షత కుల నిర్మూలనకు పోరాడక తప్పదని పేర్కొన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ దేశవ్యాప్తంగా అమలు చేయాలని, సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించకుండా స్వయం ఉపాధి పథకాలు అమలు చేయాలని ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా దేశ ప్రజలకు బేసరత్తుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. జాతీయ మహాసభల్లో దేశవ్యాప్తంగా ఆందోళన పోరాటాలు నిర్వహించుటకు భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకోనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా నిర్మాణ ప్రతిష్ఠను పెంపొందించుకోవడానికి 2025 జనవరి 5, 6, 7 తేదీలలో హైదరాబాద్ నగరంలో నిర్వహించ తలపెట్టిన అఖిలభారత దళిత హక్కుల ఉద్యమం 2వ జాతీయ మహాసభలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆవిడపు రమేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి లక్ష్మణ్, చింతల శ్రీనివాస్, ఆవిడపు రాములు, చింతల బాపు, జంగపల్లి చంద్రయ్య, మోతే శంకర్, మారుతి, రూప్ సింగ్, బాబర్ ఖాన్ పాల్గొన్నారు.

# సింగరేణి ప్రాంతం సాంస్కృతిక చైతన్యానికి ప్రతీక

నవతెలంగాణ-మందమర్రి



సింగరేణి ప్రాంతం సాంస్కృతిక చైతన్యానికి ప్రతీక అని సౌత్ ఇండియా డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సినీ దర్శకుడు శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం మందమర్రిలోని దర్గాని దర్శించుకునేందుకు కుమారుడితో వచ్చిన శంకర్‌కు తెలంగాణ ధూమ్ ధామ్ వ్యవస్థాపకుడు అంతడుపుల నాగరాజు స్థానిక కళాకారులు ఘన స్వాగతం పలికారు. కెకె-2 గని ప్రాంతంలో గల దర్గాని సందర్శించుకుని ప్రార్థనలు చేశారు. అనంతరం గఫూర్ బాబా పీర్లను దర్శించుకుని దట్టీలు కట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్థానిక కళాకారులు పూర్ణ కుంభంతో ఘన స్వాగతం పలికారు. శ్రీ వేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణలోని కోల్ బెల్ట్ ప్రాంతం సబ్బండ వర్గాలకు నిలయమని ఈ నేల ఎన్నో పోరాటలకు స్ఫూర్తినిచ్చిందన్నారు. కవులకు, రచయితలకు కళాకారులకు ఈ ప్రాంతం పెట్టిన పేరని కొనియాడారు. జై బోలో తెలంగాణ సినిమా పాట చిత్రీకరణలో తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే పీరీల పండుగలకు సంబంధించి గఫూర్ బాబా పీర్లను వాడుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అన్ని మతాల దేవుళ్ళ ఆశీషులు కోరినట్లు చెప్పారు. అప్పుడు మొక్కిన మొక్కును ఇప్పుడు చెల్లించుకునేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. త్వరలోనే తెలంగాణ ఔన్నత్యాన్ని నాటి నిజాం నవాబుల కాలం నుండి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం వరకు జరిగిన చరిత్రను అందరికీ తెలిసేలా వెబ్ సిరీస్‌కు రూపకల్పన చేస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ సాంస్కృతిక విప్లవం తీసుకొచ్చిన మందమర్రి కళాకారుడు అంతడుపుల నాగరాజుకు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో నైనా సముచిత స్థానం లభిస్తుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కళాకారులు సాధనవేణి ప్రభాకర్, లయోల కుమార్, సాదుల సాంబయ్య, ముల్కళ్ల శంకర్, ఎగ్గేటి రాజేశ్వర్ రావు, ఉప్పులేటి నరేష్, బియ్యాల ఉపేందర్, ఉప్పులేటి రాజమౌళి, హనుమాండ్ల మధుకర్, రాకం సంతోష్, కొండపర్తి సది, ఎర్రవేని రమేష్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని దేవాపూర్ అచ్యుతరావుగూడలో గురువారం రాత్రి గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధమైన కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ పరామర్శించారు. ఆత్రం సత్యవతి ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురై ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో శుక్రవారం మండల అధ్యక్షుడు రత్నం ప్రదీప్ బాధితురాలి ఇంటికి వెళ్లి పరామర్శించారు. బియ్యం, నిత్యవసర సరుకులు అందించారు. అనంతరం రత్నం ప్రదీప్ మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా కాంగ్రెస్ ఆదుకుంటుందని, ఎమ్మెల్యే వినోద్ ఆదేశాలతో ఇందిరమ్మ ఇల్లు కూడా ఇప్పిస్తామని, నష్టపరిహారం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మైదం రమేష్, మాజీ జడ్పీటీసీ రౌతు సత్తయ్య, కాంగ్రెస్ నాయకులు ముత్యాల రాజమౌళి పాల్గొన్నారు.

## మద్దతు ధరతో రైతులు లబ్ధి పొందాలి

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం కనీస మద్దతు ధరతో పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేస్తుందని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని జిల్లా మార్కెటింగ్ అధికారి ఎండీ.షాబొద్దీన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి జిల్లాలో జిన్నింగ్ మిల్లులలో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రాల ద్వారా రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తామని, ఈ సంవత్సరం డిసెంబర్ 27వ తేదీ వరకు లక్ష 6 వేల 420 క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. వాతావరణ మార్పులు, ఇతర కారణాల వలన పత్తి స్థితి మారిందని, నవంబర్ 2వ వారంలో ఎంఈసీహెచ్ పద్ధతిలో కొనుగోలు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. చెన్నూర్, లక్షెట్టిపేట కేంద్రాలలో పత్తి కొనుగోలు అధికారి డీకే నాయక్, కిరణ్ దేశ్ ముఖ్ ఆధ్వర్యంలో జనవరి 1, 2025 నుంచి ఎంఈసీహెచ్ పద్ధతిలో పత్తి కొనుగోలు జరుగుతుందని, బెల్లంపల్లి పరిధిలో ఇప్పటికే కొనుగోలు కొనసాగుతుందని తెలిపారు. 8 శాతం తేమ ఉంటే క్వింటాల్‌కు రూ.7 వేల 421, 9 శాతం ఉంటే రూ.7 వేల 346, 10 శాతం ఉంటే రూ.7 వేల 272, 11 శాతం ఉంటే రూ.7 వేల 198, 12 శాతం ఉంటే రూ.7 వేల 124 మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు. రైతులు తమ పత్తి పంటను ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలలో విక్రయించి మద్దతు ధర పొందాలని తెలిపారు.

## రైతుల ఖాతాలలో రూ.76.23 కోట్లు జమ

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వ ఆదేశాలనుసారం జిల్లాలో 317 వరి ధాన్యం కొనుగోలు ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి రూ.76 కోట్ల 23 లక్షల నగదు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేసినట్టు అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిపాదించిన 326 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఇప్పటి వరకు 317 కొనుగోలు కేంద్రాల ద్వారా 61 వేల 452 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా ఇందులో 18 వేల 82 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం ఉందని, సంబంధిత 5 వేల 144 మంది రైతుల ఖాతాల్లో రూ.76 కోట్ల 23 లక్షల జమ చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 24 రైస్ మిల్లులకు పీఎంఆర్ అనుమతులు జారీ చేయడం జరిగిందని తెలిపారు.

## అతిథి అధ్యాపక పోస్ట్‌కు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-లక్షెట్టిపేట

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల విద్యాలయంలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు బోధించటానికి బాటని జేఎల్ పోస్టు కోసం, ఎంఎస్సీ బాటని, జువాలజీ బీఈడీ, అర్హత ఉన్నటువంటి మహిళా అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపల్ రమా కళ్యాణి తెలిపారు. 30 డిసెంబర్ 2024వ తేదీన తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు రెండు సెట్ల జిరాక్స్‌తో ఉదయం 10.00 గంటలకు కళాశాలలో డెమోకు హాజరు కావాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు, ఎంపిక చేయబడిన వారు సొసైటీ నియమ నిబంధనల ప్రకారం పని చేయాల్సి ఉంటుంది.



# మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు నివాళి




నవతెలంగాణ-జన్నారం

భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ గురువారం మరణించడంతో శుక్రవారం ఉదయం వర్తక సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వ్యాపార సంస్థలు మూసి ఉంచారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక సంస్కరణలు తీసుకురావడంలో మన్మోహన్ సింగ్ చాలా కృషి చేశాడని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్తక సంఘం అధ్యక్షుడు ఓజ్జల వామన్ కుమార్, ప్రధాన కార్యదర్శి జక్కు రమేష్, కోశాధికారి కొమురవెల్లి శివరామకృష్ణ, మాజీ జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్, వర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ ఆధ్వర్యంలో**

కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముజాఫర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద డాక్టర్ మన్మోహన్ సింగ్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతాపం తెలిపి నివాళులు అర్పించి రెండు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, ముజఫర్ అలీ ఖాన్, మేకల మాణిక్యం, మిక్కిలినేని రాజశేఖర్, ఏనుగు సుభాష్‌రెడ్డి, మచ్చ శంకరయ్య, దాముక కరుణాకర్, మామిడిపెళ్లి ఇందయ్య, దుమల్ల రమేష్, దుర్గం లక్ష్మీనారాయణ, బాదావత్ సుధాకర్ నాయక్, సయ్యద్ ఇబ్రహీం, అల్లం వెంకట్రాజ్యం, శంకర్ గౌడ్, దుర్గం గంగాధర్, లక్ష్మి, ఎల్ల లావణ్య, గాజుల సత్తయ్య పాల్గొన్నారు.




**సీఐటీయూ ఆధ్వర్యంలో**

భారత మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మతి దేశానికే తీరని లోటని, సీఐటీయూ జిల్లా నాయకులు కే బుచ్చయ్య అన్నారు. మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. రెండు నిమిషాల మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. నాయకులు అంబటి లక్ష్మణ్, రాజన్న, మల్లే శ్రీనివాస్ పాల్గొన్నారు.

**జైపూర్ :** దేశ ఆర్థిక విధానాన్ని గాడిలో పెట్టిన మహోన్నత వ్యక్తి మన్మోహన్ సింగ్ అని కాంగ్రెస్ నాయకుడు, జైపూర్ మాజీ ఎంపీటీసీ మంతెన లక్ష్మణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్ల విశ్వంబర్‌రెడ్డి, రిక్కుల లక్ష్మీనారాయణరెడ్డి, అంబాల రవి, శీలం వెంకటేశం, పండుగ రాజన్న పాల్గొన్నారు.




**మంచిర్యాల :** మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మరణం యావత్ భారత దేశానికి తీరని లోటు అని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ శుక్రవారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు నివాసంలో మన్మోహన్ సింగ్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ గిరిజన కోఆపరేటివ్ ఆర్థిక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక తిరుపతి, కౌన్సిలర్లు, నాయకులు మహిళ, ఎన్ఎస్‌యూఐ నాయకులు పాల్గొన్నారు.